# ఆస్తి పన్నుల సవరణ, చెత్తపై చార్జీలను ఉపసంహరించాలని డిమాండ్ చేసిన

# రౌండ్ టేబుల్ సమావేశం.

సిరిపురం దత్ ఐలాండ్ లోని VCCI కాన్ఫరెన్స్ హాల్ లో నివాస సంక్షేమ సంఘాలు, వర్తక సంఘాలతో జరుగుతున్న రౌండ్ టేబుల్ సమావేశం ఇంటి పన్నులను ఆస్తి విలువ పై లెక్కించే కొత్త విధానం లోనికి మార్చరాదని, చెత్త పై యూజర్ ఛార్జీల విషయంలో GVMC పునరాలోచించాలని, జూన్ 3వ తేదీ ఆస్తిపన్ను పెంపు నోటిఫికేషన్ రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తున్నది.

అద్దె ఆధారిత ఇంటి పన్నుల విధానం నుండి ఆస్తి మూలధన విలువ ఆధారిత ఇంటి పన్నుల విధానం లోనికి మార్చడం చాలా అన్యాయం. ఆస్తి విలువ ను బట్టి ప్రతి ఏడూ ఆదాయం పెరగదు. పెరగని ఆస్తి ఆదాయం పైన పన్ను పోటు ఏ విధంగానూ సమంజసం కాదు. చెత్త, మురుగు నీరు, త్రాగు నీరు, రోడ్ల నిర్వహణ వంటి సదుపాయాల కల్పన కోసమే ఆస్తి పన్ను చెల్లిస్తున్నాము. అదనంగా చార్జీలు వసూలు చేసి ప్రజలతో వ్యాపారం చెయ్యడం అన్యాయం.

రాష్ట్ర జీడీపీ లో 3% మించి అప్పు కావాలంటే కొన్ని సంస్కరణలను అమలు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వం షరతులు విధించింది. ఆ షరతుల్లో భాగమే ఈ పన్నులు, పౌర సేవలపై చార్జీలు.

మన రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరిట పేదలకు నగదు బదిలీ చేస్తున్నది. వేరొక పక్క పట్టణాలలోని పేద, మధ్య తరగతి ప్రజలు, చిన్న చిన్న వ్యాపారస్తుల పైన పన్ను భారాలను భారీగా మోపుతోంది. కమర్షియల్ షాప్స్ కి కూడా పెద్ద భారమే పడుతుంది. చిన్న వ్యాపారులు దీన్ని తట్టు కోలేరు. పైసా రాబడి లేని ఖాళీ స్థలాలపై 0.50% పన్ను మరీ దారుణం. పాత పద్ధతిలో నివాస ప్రాంతాన్ని బట్టి, బిల్డింగ్ స్ట్రక్చర్ బట్టి, బిల్డింగ్ వయస్సు ని బట్టి కొన్ని రాయితీలు ఇస్తున్నారు. కొత్త పద్ధతిలో అవేవీ లేవు. పెనాల్టీలు మాత్రమే ఉంటాయి.

ఈ పద్ధతి మార్పును, పన్నుల శాతాలను విశాఖ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. నగరంలోని అపార్ట్మెంట్ లు మరియు కాలనీల్లో ని ప్రజలు, చిన్న తరహా వర్తకులు ఆస్తి పన్ను పెంపు పై అనేక భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. దానికి మద్దతు పలికే వారు ఒక్కరూ లేరు. అందుకే కరోనా, కర్ఫ్యూ లను అధిగమించి 9297 అభ్యంతరాలను GVMC కి సమర్పించారు. అభ్యంతరాలు తెలిపిన లిస్టులలోను, అసోసియేషన్లలోనూ ఇమిడి వున్న సభ్యత్వాన్ని లెక్కిస్తే ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా పెరుగుతుంది. అంతే కాక ఆస్తి పన్నుపై ఆన్లైన్ పిటిషన్ పై 6000 మంది కి పైగా సంతకాలు పెట్టారు. ప్రజానీకం వ్యతిరేకిస్తున్న ఈ కొత్త విధానాన్ని ప్రజలపై రుద్దడం అప్రజాస్వామికం.

కరోనా కష్టాల్లో ప్రజలు అనేక బాధలకు గురి అవుతున్నారని గుర్తించి తెలంగాణా, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఆస్తి పన్ను పై రాయితీలు, మినహాయింపులు ఇచ్చారు. కానీ, మన రాష్ట్ర ప్రభుత్వం కరోనా కష్టాల్లో వున్న ప్రజలపై పన్నులు, చార్జీలు పెంచడం అమానుషం.

పెట్రోలు ధరలను కేంద్ర ప్రభుత్వం నియంత్రించక పోవడం వలన, పెట్రోలు డీజిల్ తో బాటు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 'ఒకటే దేశం - ఒకటే పన్ను' అని GST ని తెచ్చి, పెట్రోలు చార్జీల పై వేరే పన్నులు బాదేస్తున్నారు, స్థానికంగా ఇంటి పన్నులు, యూజర్ చార్జీలు ఎడా పెడా బాదేస్తున్నారు. ఇదేమి పన్నుల విధానం ? ప్రజలు ఏమై పోవాలి ?

వీరికి ఆదాయం పెరగాలంటే ఎగ్గొట్టే వారి నుండి కఠినమైన పద్ధతుల్లో వసూళ్లు చెయ్యాలి. జీవీఎంసీ ఆస్తులని ఇష్టారాజ్యం గా వాడుకొనే వారి పైన పన్నులు వెయ్యాలని ఈ సమావేశం డిమాండ్ చేస్తున్నది.

**పేద, మధ్య తరగతి ప్రజలు, చిన్న చిన్న వ్యాపారస్తుల బాధలను అర్ధం చేసుకుని, ఈ పన్నుల మార్పులు, పెంపుదల ఆపు చెయ్యాలని, యూజర్ ఛార్జీల అమలును పునరాలోచించాలని జీవీఎంసీ  ని ఈ రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాము.**